సాక్షి ఖమ్మం

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



బోనస్ ఇస్తారా.. వదిలేస్తారా?

జిల్లాలో సన్నధాన్యం అమ్మిన పలువురు రైతులకు ఇప్పటివరకు బోనస్ నగదు జమ కాకపోవడంతో ఎదురుచూస్తున్నారు. 8లో



పీపీలు, కానిస్టేబుళ్లకు సన్మానం

రెండు కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడేలా వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సహకరించిన కానిస్టేబుళ్లను సీపీ సన్మానించారు. 8లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం చలి ప్రభావం సాధారణంగానే ఉంటుంది. ఆతర్వాత మధ్యాహ్నానికి ఎండ పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఉపాధి పనులతో లబ్ధి పొందాలి



ఈశ్వరమాధారంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డైరక్టర్ సృజన

కూసుమంచి: గ్రామాల్లో వ్యవసాయ పనులు లేని సమయాన ఉపాధి హామీ పనులతో నిరుపేదలు లబ్ధి పొందాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరక్టర్ సృజన సూచించారు. కూసుమంచి మండలంలోని భగవతీడు, ఈశ్వరమాధారం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను గురువారం ఆమె పరిశీలించారు. క్యాటిల్, ఫౌల్ట్రీ, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించి వాటితో జరిగిన లబ్ధిపై కూలీలు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనులతో అనేక ప్రయోజనాలు ఉన్నందున స్థానికులు సద్వినియోగం చేసుకునేలా ఉద్యోగులు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఆర్డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత, డీఎల్పీఓ రాంబాబు, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఏపీడీ శ్రీదేవి, ఏపీఓ అప్పారావు, ఏపీఎం తిరుమలరావు, ఈసీ కరుణ, టీఏ రవికాంత్, గ్రామ కార్యదర్శులు సతీష్, తిరుపతి పాల్గొన్నారు.

అటవీ సంరక్షణపై ప్రత్యేక దృష్టి



వెదురు వేలం నిర్వహిస్తున్న ఎఫ్‌డీఓ మంజుల

ఏన్కూరు: అటవీ ప్రాంతాన్ని సంరక్షిస్తూనే జంతువుల వేటను అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎఫ్‌డీఓ మంజుల వెల్లడించారు. ఏన్కూరులోని వెదురు డిపోలో గురువారం జరిగిన వేలం పాటలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. వేసవి సమీస్తున్నందున అడవుల్లో అగ్ని ప్రమాదాలకు జరగకుండా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. వన్యప్రాణుల దాహార్తి తీర్చేలా కుంటల్లో నీరు నింపుతున్నామని చెప్పారు. అలాగే, అటవీ ప్రాంతాల ప్రజలు వేటకు వెళ్లకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు ఎఫ్‌డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఉమ, డీఆర్ఓ శ్రీను, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యాన ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు సీసీ కెమెరాలు లేని కేంద్రాల్లో ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేయిస్తున్నారు. ఇప్పటికే పరీక్షలు మొదలైన నేపథ్యాన ఉన్నతాధికారుల ఆదేశాలతో కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించినట్లు డీఐఈఓ రవిబాబు తెలిపారు.

కొనసాగుతున్న పరీక్షలు

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో కొనసాగుతున్నాయి. రెండు సెషన్లు కలిపి 64 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులకు, 14కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం 1,547 మందికి 1,508 మంది, మధ్యాహ్నం 1,475 మందిలో 1,440 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు.

డిజిటల్ సర్వే త్వరగా పూర్తి చేయండి



సర్వేను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

కొణిజర్ల: రైతులు సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసేందుకు నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే పారదర్శకంగా చేపడుతూనే త్వరగా పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. మండలంలోని చిన్నగోపతిలో ఏఈఓలు నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వేను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఏ ఒక్క రైతు సర్వే నంబర్ కూడా తప్పిపోకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. కాగా, సర్వే పూర్తయ్యేవరకు ఏఈఓలకు సెలవులు మంజూరు చేయొద్దని అధికారులను ఆదేశించారు. ఏఓ డి.బాలాజీ, ఏఈఓ శ్రీనివాసరాజు రైతులు పాల్గొన్నారు.

ఆధిక్యం నుంచి అధఃపాతాళానికి...

రాష్ట్రప్రభుత్వం వివిధ పథకాల ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల ఆర్థిక పరిపుష్టికి చేయూతనిస్తోంది. అందుకు అనుగుణంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కూడా వినూత్న విధానాలతో ముందుకు సాగుతున్నారు. కానీ ఆ స్థాయిలో డీఆర్‌డీఏ అధికారుల పనితీరు లేకపోవడంతో ఒకప్పుడు స్వయం సహాయక సంఘాలకు లక్ష్యానికి మించి రుణాలు ఇవ్వగా.. ఇప్పుడు లక్ష్యం చేరడమే గగనమవుతోంది. అధికారుల నిర్లక్ష్య వైఖరికి తోడు క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుండడంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుణాల కోసం సిబ్బందికి మామూళ్లు ఇవ్వలేక సభ్యులు నిరాసక్తత కనబరుస్తున్నట్లు తెలుస్తోంది.

– ఖమ్మంమయూరిసెంటర్





జిల్లాలో బ్యాంక్ లింకేజీ రుణ లక్ష్యం, మంజూరు

స్వయం సహాయక సంఘాలు	21,348
రుణ లక్ష్యం	రూ.1113.32 కోట్లు
ఇప్పటి వరకు రుణం పొందిన సంఘాలు	7,774
రుణ మొత్తం	రూ.738.79 కోట్లు
శాతం	66.36
రాష్ట్రంలో జిల్లా స్థానం	26

ఎస్‌హెచ్‌జీలకు రుణ మంజూరులో వెనుకబాటు

- జిల్లా లక్ష్యంలో 66.36 శాతమే పూర్తి
- అధికారుల నిర్లక్ష్యంతో రాష్ట్రంలో 26వ స్థానం
- ఫలితంగా మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రభావం

రూ.1,110 కోట్లలో రూ.700కోట్లే

జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు రుణ మంజూరు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. మొత్తం 21,348 స్వయం సహాయక సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.1,113.32 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. డిసెంబర్, జనవరికల్లా ఈ లక్ష్యాన్ని గతంలో పూర్తిచేయడం ఆనవాయితీగా వచ్చేది. కానీ ఫిబ్రవరి మొదటి వారం దాటుతున్నా 7,774 సంఘాలకు రూ.738.79 కోట్ల(66.36 శాతం) మేర మాత్రమే రుణం అందించగలిగారు.

గతమెంతో ఘనం

గతంలో స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించడంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ముందుండేది. డీఆర్‌డీఓలు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ లక్ష్యంపై ఉద్యోగులకు సూచనలు చేసేవారు. దీంతో నెలవారీ లక్ష్యాల సాధన ఆర్థిక సంవత్సరం ముగియడానికి నెల, రెండు నెలల ముందే ముగిసేది. ఫలితంగా రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో ఉండేది. పలుమార్లు ఉత్తమ జిల్లాగా అవార్డులు కూడా దక్కాయి. ప్రస్తుతం అవార్డుల మాటేమో కానీ లక్ష్యసాధనే కష్టంగా కనిపిస్తోంది.

క్షేత్రస్థాయి సిబ్బంది నిర్వాకం

డీఆర్‌డీఏలో క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు మహిళా సంఘాల అభ్యున్నతిపై దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందనే ఆరోపణలు వస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలు తీసుకోవాలంటే భయపడే పరిస్థితికి చేరారు. గ్రామ దీపికలు, సీసీలు, ఏపీఎంలు సంఘాల నుంచి కమీషన్లు డిమాండ్ చేస్తుండడం.. రుణం మంజూరు కాగానే వారికి ఎంతో కొంత ముట్టచెప్పాల్సి వస్తుండడంతో సభ్యులు పెద్దగా ఆసక్తి కనబర్చడంలేదని సమాచారం. మామూళ్ల కారణంగా రుణంలో కోత పడడం, ఆపై వడ్డీతో సహా మొత్తం చెల్లించాల్సిన కారణంగా మహిళలు రుణాలు తీసుకోవడానికి వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షణ కరువే..

జిల్లాకు కేటాయించిన రుణ లక్ష్య సాధనకు జిల్లా స్థాయి అధికారులు కృషి చేయాలి. ఇందులో డీఆర్‌డీఓ కీలకంగా వ్యవహరించాల్సి ఉన్నా కనీసం సమీక్షలు కూడా నిర్వహించిన దాఖలాలు సైతం లేవనే చెప్పాలి. కొందరు అధికారులు సొంత ఆదాయంపైనే దృష్టి సారించడంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు విమర్శలు వస్తున్నాయి.

అక్కడే అత్యధికం.. అత్యల్పం

జిల్లాలోని మధిర మండలంలో లక్ష్యానికి మించి రుణాలను అందించారు. ఇక్కడ 434 సంఘాలకు రూ.38.64 కోట్ల రుణం మంజూరవగా 101.89 శాతంతో జిల్లాలోనే మొదటిస్థానంలో ఉంది. ఇదే నియోజకవర్గం బోనకల్ మండలంలో 321 సంఘాలకు రూ.25.60 కోట్లే మంజూరయ్యాయి. దీంతో 50.37 శాతంతో జిల్లాలో ఆఖరున 20వ స్థానంలో నిలిచింది. గతంలో డిసెంబర్, జనవరిలోనే మహిళా సంఘాలకు రుణాల మంజూరు పూర్తిచేసిన సందర్భాలు ఉండగా ఇప్పుడు ఆర్థిక సంవత్సరం ముగియడానికి 50రోజులే సమయం ఉన్నందున అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

అంతా సక్రమమేనా?

- ఎస్సెస్సీ విద్యార్థుల మార్కుల తనిఖీకి బృందాలు
- ఉపాధ్యాయులు కేటాయించే 20మార్కులపై పరిశీలన
- జిల్లాలో 58 బృందాల ఏర్పాటు

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి విద్యార్థులకు ఏడాది మొత్తంలో నిర్వహించే ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ) పరీక్షల ఆధారంగా వారి స్థాయికి తగినట్లు ఉపాధ్యాయులు మార్కులు ఇస్తారు. ఇందుకోసం 20మార్కులు కేటాయిస్తుండగా కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో అందరికీ ఒకే తరహాలో మార్కులు వేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యాన విద్యార్థుల స్థాయికి తగినట్లు మార్కులు వేశారా, లేదా అన్నది పరిశీలించేందుకు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందానికి హెచ్‌ఎం నేతృత్వం వహించనుండగా ముగ్గురు ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఈ బృందాలు 11వ తేదీ నుంచి 13 వరకు వారికి కేటాయించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తారు.

ఇదే చివరిసారి..

గత ప్రభుత్వం ఈ ఇంటర్నల్ మార్కుల విధానాన్ని ప్రవేశపెట్టింది. అంతకుముందు పదో తరగతి విద్యార్థులకు 100 మార్కులతో ప్రశ్నపత్రాలు ఉండేవి. అయితే, ఎఫ్ఏ విధానం అమల్లోకి వచ్చాక 80 మార్కులకు ప్రశ్నపత్రం ఇస్తూ, మిగతా 20 మార్కులను ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ) పరీక్షల ఆధారంగా ఉపాధ్యాయులు వేస్తున్నారు. కాగా, ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానాన్ని వచ్చే ఏడాది నుంచి రద్దు చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో 100మార్కులకు ప్రశ్నపత్రాలే ఉంటాయి.

58 బృందాలతో తనిఖీ

జిల్లాలోని 424 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 16,416 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఆయా పాఠశాలలను ఈనెల 11 నుంచి 13 వరకు ప్రత్యేకంగా నియమించిన 58 బృందాలు సందర్శిస్తాయి. ఇప్పటికే పాఠశాలల వారీగా వెళ్లే బృందాలతో జాబితా సిద్ధం చేసినట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో మండల స్థాయిలో ఎంఈఓలు బృందాలతో సమావేశమై ఎఫ్ఏ మార్కుల పరిశీలనపై సూచనలు చేస్తారు. ఉదయం, మధ్యాహ్నం రెండేసి పాఠశాలల్లో తనిఖీ చేయించే అవకాశముంది. అయితే, ఈ బృందాలు తనిఖీలకు వెళ్లనుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు ఇబ్బంది ఎదురు కాకుండా చూస్తామని అధికారులు చెబుతున్నారు.

మార్కులు ఎలా వేశారనే..

గత విద్యాసంవత్సరాల్లో విద్యార్థి ప్రతిభ ఆధారంగా ఈ ఏడాది ఎఫ్ఏ పరీక్షల్లో ఉపాధ్యాయులు వేసిన మార్కులను బృందాలను బేరీజు వేస్తాయి. తద్వారా విద్యార్థి సామర్థ్యానికి తగినట్లుగా మార్కులు వేశారా, లేదా అన్నది గుర్తించే అవకాశముంది. ఒకవేళ విద్యార్థికి ఎక్కువ మార్కులు వేశారని భావిస్తే వాటిని తగ్గించనున్నట్లు తెలుస్తోంది. బృందాలు మూడు రోజుల్లోగా తనిఖీలు పూర్తిచేసి నివేదికలు రూపొందిస్తారు. అనంతరం నివేదికల ఆధారంగా విద్యార్థుల మార్కులను హెచ్‌ఎంలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆపై ఎంఈఓలు పరిశీలించి అంతా సవ్యంగానే ఉంటే ఆమోదించాల్సి ఉంటుంది.

పక్కాగా రికార్డుల తనిఖీ



ఎఫ్ఏ మార్కుల తనిఖీలు పకడ్బందీగా నిర్వహించనున్నాం. ఈనెల 11 నుంచి 13 వరకు బృందాలు పాఠశాలల వారీగా మార్కులను తనిఖీ చేయనున్నాయి. ఈ సమయంలో తప్పనిసరి రికార్డులు పరిశీలించడంతో పాటు కొందరు విద్యార్థుల సామర్థ్యాలను సైతం పరీక్షించాల్సి ఉంటుంది.

– నారాయణ, కార్యదర్శి, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్

1.04లక్షల మందికి రూ.58.12 కోట్లు

జిల్లా రైతులకు 'భరోసా' జమ

ఖమ్మంవ్యవసాయం: రైతు భరోసా పథకం ద్వారా ఎకరం వరకు సాగు భూమి కలిగిన వారి ఖాతాల్లో గురువారం నగదు జమ అయింది. రాష్ట్రప్రభుత్వం ఎకరాకు రూ. 6 వేల చొప్పున పెట్టుబడి సాయం ఇస్తామని ప్రకటించి గతనెల 26న ఎంపిక చేసిన గ్రామాల రైతులకు నగదు మంజూరు చేసింది. తాజాగా ఎకరం వరకు సాగు భూమి కలిగిన రైతులందరి ఖాతాల్లో రూ.6వేల మేర నగదు జమ చేసింది. జిల్లాలో 3.51 లక్షల మంది రైతులను పథకానికి అర్హులుగా తేల్చగా సాగుభూమి ఆధారంగా రూ. 369 కోట్లు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఇందులో ఇప్పటి వరకు 1,04,934 మంది రైతుల ఖాతాల్లో రూ. 58.12 కోట్లు జమ అయ్యాయి. ఇంకా 2.46 లక్షల మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తుండగా, గత ప్రభుత్వం మాదిరిగానే ఎకరం నుంచి మొదలు ఎక్కువ భూమి ఉన్న వారి వరకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలుస్తోంది.

భూమికి భూమి లేదా మార్కెట్ ధర

అప్పుడే రిటైనింగ్ వాల్‌కు భూమి ఇస్తాం...

ఖమ్మంఅర్బన్: ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల పరిధిలో గ్రామాలు, కాలనీలను మున్నేటి ముప్పు నుంచి తప్పించడానికి చేపట్టిన రిటైనింగ్ వాల్స్ నిర్మాణంలో భూసేకరణ సమస్యగా మారింది. మున్నేటికి ఇరువైపులా సుమారు 17 కి.మీ. వాల్స్ నిర్మాణానికి 240ఎకరాల భూమి అవసరమవుతుందని రెవెన్యూ , ఇరిగేషన్ అధికారులు సర్వేలో తేల్చారు. ఇందులో 45ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, మిగిలిన 195 ఎకరాలను ప్రైవేట్ వ్యక్తుల ద్వారా సేకరించాల్సి ఉంటుంది. ఇందులో 200వరకు ప్లాట్లు, పదికిపైగా ఇళ్లు, అనధికారిక లేఔట్లు ఉన్నట్లు తెలిసింది. అయితే, భూములు, ప్లాట్లు కోల్పోయే వారు భూమికి భూమి లేదా మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. ఇలా చేయాలంటే సుమారు రూ 80 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తేల్చినట్లు తెలిసింది. ఈమేరకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమేష్, జలవనరుల శాఖ అధికారులు త్వరలోనే సమావేశమై భూసేకరణ విషయంలో ఎలా ముందుకు సాగాలో చర్చించనున్నట్లు సమాచారం. ఆపై మంత్రులు, కలెక్టర్‌తో చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలిసింది.

సంపూర్ణ ఆరోగ్యం అందరి హక్కు

- మెరుగైన వైద్యసేవలందిస్తేనే ఇది సాధ్యం
- ఎన్‌సీడీ క్లినిక్‌ను ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



చికిత్స కోసం వచ్చిన మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంవైద్యవిభాగం: సంపూర్ణ ఆరోగ్యం అందరి హక్కు అని.. ఇందులో భాగంగా మెరుగైన సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఎన్.సీ.డీ. విభాగాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చే క్రమాన అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమం కింద ఎన్.సీ.డీ. క్లినిక్ విభాగం ఏర్పాటుచేశామని తెలిపారు. రక్తపోటు, వృద్ధాప్య, మానసిక సమస్యలు, కిడ్నీ, కాలేయం, కేన్సర్, మధుమేహం, గుండెతో పాటు పక్షవాత బాధితులకు ఇక్కడ చికిత్స అందుతుందని చెప్పారు. అనంతరం ఆయన వివిధ విభాగాలను పరిశీలించి చికిత్స కోసం వచ్చిన వారితో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అలాగే, పార్కింగ్, టాయిలెట్ల నిర్మాణంపై ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ రాంబాబు, పబ్లిక్ హెల్త్‌ఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఉన్న సఖి కేంద్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం పరిశీలించారు. ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలను ప్రత్యేక అధికారి రోజారాణి వివరించగా, సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కరిస్తానని తెలిపారు. సెక్యూర్ సంస్థ ప్రతినిధి ఏ.వెంకటకృష్ణ, అడ్మిన్ కె.సరిత, కౌన్సిలర్లు పి.శ్రీదేవి, అంజని, స్వరూప, అరుణ, పుష్పలత పాల్గొన్నారు.

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా బందోబస్తును పరిశీలించిన ఆయన సూచనలు చేశారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు కలెక్టర్ లేఖ

పరీక్షలంటే భయం పోగొట్టేలా వినూత్న ప్రయోగం

ఖమ్మంసహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యాన విద్యార్థుల్లో భయం పోగొట్టడం, ధైర్యంగా హాజరయ్యేలా సిద్ధం చేసేందుకు సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఖమ్మం ఎన్నెస్పీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన సదస్సుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హాజరు కాగా మంచి స్పందన వచ్చింది. దీంతో ప్రతీ విద్యార్థికి తన సంతకంతో కూడిన లేఖ అందించాలని ఆయన నిర్ణయించారు. ఈవిషయమై డీఈఓ సోమశేఖరశర్మ ఉద్యోగులతో గురువారం సమావేశమై లేఖ తయారీపై సమీక్షించారు. అలాగే, విద్యార్థులకు పరీక్షలకు సిద్ధం చేయించాల్సిన అంశంపై జెడ్పీ హాల్‌లో శుక్రవారం జరిగే సమావేశంలో హెచ్‌ఎంలకు సూచనలు చేయనున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు.. ఓ ఆయుధం

రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల



వెన్నెలను సత్కరిస్తున్న కళా, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధమని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ జీ.వీ. వెన్నెల తెలిపారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ప్రసాదించిన ఓటు హక్కు ఎంతో విలువైందని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యాన ఖమ్మంలో రచయిత, కవి యశ్‌పాల్ అధ్యక్షతన గురువారం 'ఓటు విలువ – ప్రాధాన్యత'పై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సదస్సులో వెన్నెల మాట్లాడుతూ కులాలతో పాటు ఇతర ప్రలోభాలను చూసి కాకుండా సమస్యల పరిష్కారానికి పాటుపడే వారినే ఎన్నుకోవాలని సూచించారు. తద్వారా విద్యావంతులు సమాజంలో ఆదర్శంగా నిలవాలని కోరారు. కాగా, ఓటు హక్కు ప్రాధాన్యతపై సాంస్కృతిక సారథి కళాకారులు విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కవి, రచయిత దేవేంద్ర, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి, వివిధ సంస్థల ప్రతినిధులు అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, జీవన్, చక్రాల రఘు, కానుగుల రాధాకృష్ణ, పోలూరు రాము, పుల్లారావు, సుధాకర్, జాన్, వెంకన్న, ముత్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల్లో శాస్త్రవేత్తల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



రేజర్లలో పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సత్తుపల్లిరూరల్/నేలకొండపల్లి: జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసే వరి పంట నిర్ణీత వ్యవధికి ముందే పొట్టకు రావడంతో నష్టం జరిగే అవకాశముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై 'పొట్ట కొట్టిన వరి' శీర్షికన 'సాక్షి'లో గురువారం కథనం ప్రచురితం కాగా శాస్త్రవేత్తలు, అధికారులు స్పందించారు. సత్తుపల్లి మండలం రేజర్లలో ఆర్ఎన్ఆర్–15048 రకం వరి సాగు చేసిన రైతుల పొలాలను వైరా కేవీకే శాస్త్రవేత్తలు పరిశీలించారు. వరి సాగు విస్తీర్ణం, ఇప్పటివరకు వాడిన మందులు, దుబ్బు దశలో కంకులు ఈనిన పంట శాతం నమోదు చేసుకున్నారు. అలాగే, నేలకొండపల్లి మండలం పైనంపల్లిలోనూ పలువురి పొలాలను అధికారులు పరిశీలించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చైతన్య, ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి, ఏఓ వై.శ్రీనివాసరావు, విత్తన ధ్రువీకరణ అధికారి టి.వేణుమాధవ్, ఏఈఓలు టి.నరేష్, దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ కళకళ

- విక్రయానికి 70 వేల బస్తాల మిర్చి
- ధరలో కానరాని పురోగతి



మిర్చి బస్తాలతో నిండిన యార్డు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి బస్తాలతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కళకళలాడింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచే కాక ఏపీలోని ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల రైతులు 70 వేల బస్తాల మిర్చిని తీసుకురావడంతో మార్కెట్‌లోని షెడ్లే కాక యార్డులన్నీ నిండిపోయాయి. మిర్చి రెండో కోతలు జోరుగా సాగుతుండడంతో విక్రయాలు పెరిగినట్లు చెబుతున్నారు.

నాణ్యత ఉన్నా అంతే...

ప్రస్తుతం రెండో కోత మిర్చి నాణ్యత ఉండడంతో మెరుగైన ధర లభిస్తుందని రైతులు ఆశించారు. కానీ గురువారం మిర్చి జెండా పాటలో క్వింటాకు రూ.14,025 ధర పలకగా, మోడల్ ధర రూ.13,700, కనిష్ట ధర రూ.6వేలుగానే నమోదైంది. మార్కెట్‌కు తీసుకొచ్చిన 70వేల బస్తాల మిర్చిలో అత్యధికంగా మోడల్ ధరతోనే కొనుగోళ్లు చేపట్టారు. ఇక నిల్వ మిర్చికి రూ.6వేల నుంచి రూ.13,300 ధర, తాలు మిర్చికి గరిష్టంగా రూ.6,900 ధర పలికింది. గత ఏడాది రెండో కోత మిర్చికి రూ.20వేలకు పైగా ధర లభిస్తే ఇప్పుడు రూ.14వేలుగానే ఉండడం.. ఇది గత ఏడాది తాలు మిర్చికి వచ్చిన ధరే కావడం గమనార్హం.

కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నా..

దేశ, విదేశాలకు ఎగుమతి చేసే వ్యాపారులు మిర్చి కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తున్నారు. నాణ్యమైన పంట కావడంతో విదేశాల ఆర్డర్లు తీసుకుని కొనుగోలు చేస్తున్నా డిమాండ్ అంతగా లేదని చెబుతూ ధర మాత్రం పెంచడం లేదు. మరోపక్క ఓ ధర నిర్ణయించి కాంటా సమయాన తేమ, తాలు పేరిట క్వింటాకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు తగ్గించి రైతులను దగా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈవిషయమై పలువురు ఫిర్యాదు చేయడంతో మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, గ్రేడ్–2, కార్యదర్శి వి.సుజన్‌బాబు, సహాయ కార్యదర్శి వీరాంజనేయులు తదితరులు గురువారం సాయంత్రం వ్యాపార ప్రతినిధులతో చర్చించి సూచనలు చేశారు.

క్లుప్తంగా

‘భారతి’ సిమెంట్స్ ద్వారా ఉచిత బీమా



మేస్త్రీలకు బాండ్లు అందజేస్తున్న నాగేశ్వరరావు, సాగర్‌రెడ్డి

సత్తుపల్లి: భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ఇతర వాటితో పోలిస్తే మూడు రెట్లు మెరుగైనదని ఆ సంస్థ మేనేజర్ వి.నాగేశ్వరరావు, ఇంజనీర్ సాగర్‌రెడ్డి వెల్లడించారు. సత్తుపల్లిలో గురువారం ధరణి సిమెంట్, స్టీల్ సిండికేట్‌లో నిర్వహించిన తాపీమేస్త్రీల సమావేశంలో వారు మాట్లాడారు. ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణాలు పటిష్టంగా ఉంటాయన్నారు. ఈ సిమెంట్ వాడే వారికి ఉచిత సాంకేతిక సాయం అందిస్తామని తెలిపారు. అనంతరం 65 తాపీమేస్త్రీలకు రూ.లక్ష విలువైన ఉచిత బీమా బాండ్లు అందించారు. ఈ కార్యక్రమంలో డీలర్ రమణారావు పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రంలో శ్రీలంక పర్యాటకులు



పర్యాటకులతో శివనాగిరెడ్డి

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రాన్ని శ్రీలంకకు చెందిన పర్యాటకులు గురువారం సందర్శించారు. రాష్ట్రంలోని నాగార్జున సాగర్, ఫణిగిరి మీదుగా నేలకొండపల్లికి 14 మంది పర్యాటకులు వచ్చారు. ఈ సందర్భంగా వారికి క్షేత్రం వివరాలను బుద్ధవనం ప్రాజెక్ట్ కన్సల్టెంట్ డాక్టర్ శివనాగిరెడ్డి వివరించారు. ఈ బృందంలో శ్రీలంక ఎయిర్ లైన్స్ ప్రతినిధులు, టూరిజం అధికారులు కూడా ఉన్నారు. ఇక్కడి ప్రత్యేక ప్రాంతాలను సందర్శించాక శ్రీలంక నుంచి రావడానికి ఆసక్తిగా ఉన్న పర్యాటకులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

పాఠశాలకు రూ.3 లక్షల విలువైన ఫర్నిచర్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు హైదరాబాద్ నోష్ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా రూ.3లక్షల విలువైన ఫర్నిచర్ అందజేశారు. ఈమేరకు కుర్చీలు, టేబుళ్లు, బీరువాలు, రివాల్వింగ్ చైర్లు గురువారం పాఠశాలకు చేరుకున్నాయి. ఈసందర్భంగా నోష్ల్యాబ్ అధినేతలకు హెచ్‌ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు చెప్పడంతో పాటు ఇందుకు సహకరించిన ఉపాధ్యాయురాలు చిట్టి కుమారికి అభినందనలు తెలిపారు.

ప్రేమించి మోసం చేశాడని నిరసన

పెనుబల్లి: మండలంలోని మండాలపాడుకు చెందిన ఓ యువతి అదే గ్రామానికి చెందిన ఓరుగంటి గోపీచంద్ ఇంటి ఎదుట గురువారం ధర్నాకు దిగింది. గోపీచంద్, తాను ఏడేళ్ల నుంచి ప్రేమించుకుంటుండగా ఇప్పుడు ముఖం చాటేస్తున్నాడని ఆరోపించింది. కాగా, యువతి నిరసన తెలుపుతుండగా గోపీచంద్, ఆయన తల్లిదండ్రులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. దీంతో యువతి రాత్రి పొద్దుపోయే వరకు అక్కడే కూర్చుని నిరసన కొనసాగింది.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడుకు చెందిన వివాహిత అయిలూరి శ్రీలత(33) ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం ఉదయం కడుపునొప్పి అధికమవడంతో భరించలేక ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. శ్రీలత తండ్రి శీలం బ్రహ్మానందరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న వాహనం సీజ్

కల్లూరు: ఏపీలో రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని గురువారం కల్లూరులో పోలీసులు సీజ్ చేశారు. ఈమేరకు పశువులను తరలిస్తున్న నమ్మి మణికంఠ స్వామి, అందే నాగేశ్వరరావును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ హరిక తెలిపారు. అలాగే, వాహనంలోని 19 పశువులను పాల్వంచలోని గోశాలకు తరలించినట్లు వెల్లడించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెనుబల్లి: మండలంలోని లంకపల్లిలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీల్లో గుర్తించారు. గ్రామానికి చెందిన ధరా ఉపేందర్ 17 క్వింటాళ్ల బియ్యాన్ని ఇంట్లో నిల్వ చేశాడనే సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు బియ్యాన్ని సీజ్ చేసి ఉపేందర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

తల్లాడ: మండలంలోని కుర్నవల్లిలో గురువారం తెల్లవారుజామున వరి గడ్డి వాము దగ్ధమైంది. స్థానిక సొసైటీ బజారులో రైతు కర్నాటి దుర్గ సాగు చేసిన నాలుగు ఎకరాల్లోని గడ్డితో వాము వేశారు. ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో సుమారు రూ.40 వేల విలువైన గడ్డి కాలిపోయింది.

బోనస్ ఇస్తారా.. వదిలేస్తారా?

సన్నధాన్యం అమ్మిన రైతుల ఎదురుచూపులు

- 30 – 35 శాతం మంది అన్నదాతలకే చెల్లింపు
- బ్యాంకు కోడ్ మారిందని దాటవేత ధోరణి
- జిల్లాలో 27.24 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ



చింతకానిలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తున్న అధికారులు (ఫైల్)

చింతకాని: క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామన్న విస్తృత ప్రచారంతో జిల్లా రైతులు ఖరీఫ్‌లో సన్నధాన్యమే ఎక్కువగా సాగు చేశారు. అయితే, ధాన్యం అమ్మకాలు ముగియగా ఇప్పటికే మిల్లర్లు గోదాంలకు సీఎంఆర్ చేరుస్తున్నారు. కానీ ధాన్యం అమ్మిన రైతుల్లో పలువురికి మద్దతు ధర జమ అయినప్పటికీ బోనస్ మాత్రం అందకపోవడంతో ఎదురుచూపుల్లో గడుపుతున్నారు.

వ్యయప్రయాసలతో సాగు

మద్దతు ధరకు తోడు రూ.500 బోనస్ వస్తుందనే ఆశతో పెద్దసంఖ్యలో రైతులు సన్నరకాల సాగుకే మొగ్గు చూపారు. పెట్టుబడి పెరుగుతుందని, దిగుబడి తగ్గుతుందని తెలిసినా వెనుకబడుగు వేయలేదు. కానీ ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించిన పలువురికి బోనస్ నగదు చెల్లించలేదని వాపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా 20మండలాల్లో సొసైటీలు, ఐకేపీ ఆధ్వర్యాన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఈమేరకు 47,447 మంది రైతుల నుంచి 27.24 లక్షల క్వింటాళ్ల సన్నధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈమేరకు ప్రభుత్వం రూ.136.17 కోట్ల బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. అయితే, ఇప్పటివరకు కేవలం 30 నుంచి 35 శాతం రైతులకే బోనస్ జమ అయిందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కాగా, చింతకాని మండలంలో 841 మంది రైతుల వద్ద నుంచి 39,298 క్వింటాళ్ల సన్నరకం ధాన్యాన్ని కొనుగోళ్లు చేశారు. క్వింటాకు రూ.2,320 మద్దతు ధరకు తోడు రూ.1.97 కోట్ల బోనస్ రైతుల ఖాతాలో జమ చేయాలి. ఇప్పటివరకు కేవలం 25శాతం మంది రైతులకు బోనస్ నగదు జమ అయింది. అయితే, కొందరు రైతులకు మద్దతు ధర కూడా జమ కాలేదని కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరు మారిన బ్యాంకు

జిల్లాలోని చాలా వరకు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఏపీజీవీబీలో ఖాతాలు ఉన్నాయి. దీంతో ఆ బ్యాంకు ఖాతాల వివరాలనే ధాన్యం విక్రయించే సమయాన నిర్వాహకులకు సమర్పించారు. ఇంతలోనే డిసెంబర్‌లో ఏపీజీవీబీ కాస్త టీజీబీగా పేరు మారింది. అంతేకాక బ్యాంక్ ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ సైతం మారడంతో బోనస్ నగదు జమ కావడానికి అడ్డంకి ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. రైతుల ఖాతాలకు సంబంధించి ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ వివరాలను సొసైటీల సిబ్బంది మళ్లీ సేకరిస్తున్నా ఎడతెగని జాప్యం జరుగుతుండడం గమనార్హం.

84 క్వింటాళ్లు విక్రయించా..



చింతకాని సొసైటీ పరిధి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెలన్నర క్రితం 84 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించాను. అయినప్పటికీ బోనస్ ఇంకా జమ కాలేదు. ఎప్పుడు బ్యాంకుకు వెళ్లి అడిగినా నగదు రాలేదని చెబుతున్నారు.

– నర్సింశెట్టి లక్ష్మీనారాయణ, రైతు, మత్కేపల్లి

ఇకనైనా చెల్లించాలి



రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. ప్రభుత్వ కేంద్రాల్లోనే మద్దతు ధర, బోనస్ వస్తుందని చెప్పడంతో అలాగే విక్రయించాను. అయినా ఇప్పటివరకు బోనస్ రాకపోవడంతో ఎదురుచూడాల్సి వస్తోంది.

– తాళ్లూరి రమేష్, రైతు, జగన్నాథపురం

వివరాలు సేకరిస్తున్నాం..



రైతులెవరూ ఆందోళన చెందవద్దు. ఏపీజీవీబీ పేరు మారడంతో ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ కూడా మారింది. దీంతో ఖాతాల వారీగా కొత్త కోడ్ వివరాలను రైతుల నుంచి సేకరించి త్వరలోనే బోనస్ జమ అయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం.శ్రీనివాసరావు, సీఈఓ, చింతకాని సొసైటీ

వడలిపోతున్న మొక్కజొన్న



నీరందక వడలిపోయిన మొక్కజొన్న చేను

బోనకల్: మండలంలోని బోనకల్ బ్రాంచ్ కెనాల్(బీబీసీ) పరిధి ఆళ్లపాడు మైనర్ కింద చివరి భూములకు నీరందక రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట వడలిపోతోంది. వారబందీ విధానంతో తమ భూములకు నీరు అందం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం వారం పాటు మాత్రమే బీబీసీకి నీరు విడుదల చేస్తుండడం, మైనర్ పరిధిలోని భూములకు నీరు సమయానికి నిలిపివేస్తుండడంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వారబందీ విధానం ఎత్తేయాలని రైతులు కోరుతున్నారు.

ఫైళ్లు మాయం, అటెండర్‌పై వేటు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఇంజనీరింగ్ విభాగంలో అటెండర్‌ను అధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఇంజనీరింగ్ విభాగంలోని డీబీ సెక్షన్‌కు సంబంధించి కొన్ని ఫైళ్లు కనిపించడం లేదని ఇటీవల గుర్తించారు. ఓ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఫైళ్లను బయటకు తెప్పించినట్లు తెలియగా, అందుకు అటెండర్ రాజేశ్వరి కారణమంటూ సస్పెండ్ చేసినట్లు సమాచారం. అలాగే, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌పై చర్యలకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇక విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తేలడంతో కేఎంసీలో విధులు నిర్వర్తించే ఓ బిల్ కలెక్టర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు, మరో బిల్ కలెక్టర్‌ను క్షేత్ర స్థాయిలో పన్నుల వసూళ్లకు పంపించినట్లు సమాచారం.

మేం సీనియర్లం...

కేఎంసీలో కొందరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది తీరుతో ఇటీవల విధుల్లో చేరిన వార్డ్ ఆఫీసర్లు ఆవేదన చెందుతున్నట్లు తెలిసింది. వార్డు ఆఫీసర్లతో కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అమర్యాదగా వ్యవహరిస్తుండడం, ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకుండా అడ్డుపడుతున్నారని సమాచారం. ఇటీవల ఓ మహిళ ఉద్యోగితో ఔట్ సోర్సింగ్ సిబ్బంది వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు మందలించినట్లు తెలిసింది. ఇదంతా కమిషనర్ దృష్టికి వెళ్లకుండా ఓ ఉద్యోగి అడ్డుపడుతున్నాడని ప్రచారం జరుగుతోంది.

గిట్టని వ్యక్తిని పోలీసులకు పట్టించాలని పథకం

జిలెటిన్ స్టిక్స్‌తో వెళ్తుండగా అరెస్ట్



నిందితుడు, జిలిటిన్ స్టిక్స్‌తో పోలీసులు

ఏన్కూరు: ఎవరిపైన అయినా కోపం ఉంటే గొడవ పెట్టుకోవడం, ఘర్షణ పడేవారిని మనం చూస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం జిలెటిన్ స్టిక్స్‌ను సదరు వ్యక్తి ఇంట్లో పెట్టి పోలీసులకు పట్టించాలని పథకం పన్నగా.. స్టిక్స్ తీసుకెళ్తున్న వ్యక్తే పోలీసులకు చిక్కాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తమేడేపల్లికి చెందిన కొరసం రమేష్‌కు గ్రామానికే చెందిన గంగరాజుతో గొడవలు ఉన్నాయి. దీంతో గంగరాజును పోలీసులకు పట్టించాలని నిర్ణయించుకున్న రమేష్ జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లను ఆయన ఇంట్లో పెట్టేందుకు సిద్ధమయ్యాడు. వీటిని కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై వస్తుండగా మండలంలోని జన్నారం క్రాస్ వద్ద గురువారం చేపట్టిన తనిఖీల్లో పోలీసులు గుర్తించారు. ఈమేరకు రమేష్‌ను విచారించగా విషయం చెప్పడంతో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని ఆయనను రిమాండ్ తరలించారు. తనిఖీల్లో ఎస్‌ఐ రఫీ, హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, ఉద్యోగులు రవి, సైదా పాల్గొన్నారు.

మృతి చెందిన మూడు నెలలకు గుర్తింపు

సమాధి వద్ద కన్నీరుమున్నీరైన కుటుంబీకులు



కిష్టమ్మ అంత్యక్రియలు జరిగిన చోట నివాళులర్పిస్తున్న కుటుంబీకులు

నేలకొండపల్లి: ఇంటి నుంచి తప్పిపోయిన మహిళ కోసం మూడు నెలలుగా గాలిస్తుండడంతో చివరకు ఆమె మృతి చెందిందని, గుర్తు తెలియని మృతదేహంగా భావించి అంత్యక్రియలు కూడా పూర్తిచేశారని తెలియడంతో ఆమె కుటుంబీకులు కన్నీరుమున్నీరైన ఘటన ఇది. నల్లగొండ జిల్లా కేతపల్లి మండలం ఉప్పలపహాడ్‌కు చెందిన కుక్కమూడి కిష్టమ్మ (70) గత ఏడాది నవంబర్ 27న వేములవాడలోని బంధువుల ఇంటికి ఒంటరిగా వెళ్తూ ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో పడి గల్లంతైనట్లు సమాచారం. ఆ తర్వాత డిసెంబర్ 17న కూసుమంచి మండలంలోని కాల్వలో వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించినా అప్పటికే గుర్తు పట్టలేని స్థితిలో ఉండడంతో మార్చురీలో భద్రపరిచారు. పోలీసులు సోషల్ మీడియా ద్వారా ఆచూకీ కోసం యత్నించినప్పటికీ వివరాలు తెలియకపోవడంతో డిసెంబర్ 25న మృతదేహానికి అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో అంత్యక్రియలు పూర్తిచేయించారు. అనంతరం వాట్సప్‌లో ఓ గ్రూప్ నుంచి మరో గ్రూప్‌కు ఫొటోలు షేర్ చేస్తుండడం.. కిష్టమ్మ కుటుంబీకులు ఆరా తీస్తుండడంతో విషయం బయటపడింది. దీంతో నేలకొండపల్లి పోలీసులను గురువారం ఆశ్రయించగా అంత్యక్రియలు పూర్తయినట్లు చెప్పడంతో శ్మశాన వాటికలో నివాళులర్పించి భారమైన హృదయంతో వెనుదిరిగారు.

రైతు ఇంట్లో రూ.2లక్షలు చోరీ

- పట్టపగలే ఇంటి తాళం పగలగొట్టిన దుండగులు

బోనకల్: ఓ రైతు ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బును భద్రపర్చుకోగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బోనకల్ మండలం కలకోటకు చెందిన విజ్జగాని కొండలు పొలం కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ధాన్యాన్ని విక్రయించగా ఖాతాలో నగదు జమ అయింది. ఈనేపథ్యాన భూమి కౌలు చెల్లించడంతో పాటు ఇతర ఖర్చుల కోసం ఆయన రూ.2లక్షలు డ్రా చేసి ఇంటి బీరువాలో భద్రపర్చాడు. గురువారం ఉదయం కుటుంబంతో కలిసి ఆయన ఇంటికి తాళం వేసి పెద్దగోపతిలోని బంధువుల ఇంట శుభకార్యానికి వెళ్లాడు. సాయంత్రం వచ్చేసరికి తలుపు, లోపల బీరువా పగులగొట్టిన దుండగులు రూ.2 లక్షల నగదుతో పాటు జత పట్టీలు ఎత్తుకెళ్లారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుబాబు తెలిపారు.

ఉపకరణాలకు దివ్యాంగుల ఎంపిక కోసం శిబిరాలు

ఖమ్మంసహకారనగర్: దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను అందించేందుకు గాను ఐదు నియోజకవర్గాల పరిధిలో ఈనెల 10నుంచి 14వ తేదీ వరకు ఎంపిక శిబిరాలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్ రోడ్డులోని రోటరీ క్లబ్‌లో, 11న సత్తుపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, 12న మధిర రైతు వేదిక, 13న వైరా రైతు వేదిక, 14న కూసుమంచి రైతు వేదికలో శిబిరాలు ఉంటాయని వెల్లడించారు. వయోవృద్ధులకు చేతి కర్రలు, వాకర్స్, వినికిడి యంత్రాలతో పాటు దివ్యాంగులకు చార్జింగ్ బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లు, కాలిపర్స్, కృత్రిమ అవయవాలను అలింకో సంస్థ సహకారంతో అందజేయనున్నట్లు తెలిపారు. ట్రై సైకిళ్ల కోసం 16ఏళ్లు పైబడి 80 శాతం వైకల్యం కలిగిన వారు, రూ.1.80లక్షల వార్షికాదాయం కలిగిన వయో వృద్ధులు, దివ్యాంగులైతే రూ.2.70 లక్షలకు ఆదాయం మించని వారు అర్హులని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఫొటో, రేషన్ కార్డు, వైకల్య ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని సూచించారు.

పీపీలు, కానిస్టేబుళ్లకు సన్మానం



సన్మానం అందుకున్న వారితో సీపీ సునీల్‌దత్, అధికారులు

ఖమ్మంక్రైం: కీలకమైన రెండు హత్య కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడేలా వాదనలు వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో పాటు వారికి సహకరించిన కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్లను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం సన్మానించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఏ.శంకర్, బి.కృష్ణమోహన్‌తో పాటు ముదిగొండ, తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ల కానిస్టేబుళ్లు ఆదినారాయణ, భద్రాజీ, హోంగార్డు యూసుఫ్‌ను సన్మానించాక సీపీ మాట్లాడారు. పక్కాగా దర్యాప్తు, సాక్షాల సేకరణ, చార్జ్‌షీట్ల దాఖలతో పాటు కోర్టులో పటిష్టమైన వాదనలు వినిపించడం ద్వారా నిందితులకు శిక్ష పడేలా చేయొచ్చని నిరూపితమైందన్నారు. మిగతా కేసుల్లోనూ నిందితులు తప్పించుకోకుండా, బాధితులకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. ట్రెయినీ ఐపీఎస్ రుత్విక్‌సాయి, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐలు మురళి, సంజీవ్, ఎస్సై జగదీశ్ పాల్గొన్నారు.

కాల్వలో ట్రాక్టర్ పడడంతో రైతు మృతి

- మొక్కజొన్న చేనుకు నీరు పెట్టేందుకు వెళ్తుండగా ప్రమాదం



రవి (ఫైల్)

కొణిజర్ల: ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో ట్రాక్టర్ బోల్తా పడగా రైతు మృతి చెందాడు. మండలంలోని పెద్దగోపతిలో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు. పెద్దగోపతికి చెందిన తడికమళ్ల రవి(30) తన తండ్రి, మాజీ సర్పంచ్ దానియేలుతో కలిసి మూడెకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. ఆ పంటకు నీరు కట్టేందుకు గురువారం ఉదయం ట్రాక్టర్‌పై జనరేటర్ తీసుకుని మిత్రులు తడికమళ్ల కల్యాణ్, మొండితోక విజయ్‌తో కలిసి బయలుదేరాడు. రాపల్లె మేజర్ కాల్వ మీదుగా వెళ్లే క్రమాన ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కాల్వ కట్ట పైనుంచి కాల్వలో పడింది. దీంతో కల్యాణ్, విజయ్ కాల్వలోకి దూకి ప్రాణాలు దక్కించుకోగా, రవిపై ఇంజన్ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు జేసీబీ సాయంతో ఆయన మృతదేహాన్ని, ట్రాక్టర్‌ను వెలికితీశారు. రవికి భార్య రాధమ్మతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.సూరజ్ తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడు...

కారేపల్లి: ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో యువకుడు మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం పేరుపల్లి–జమాళ్లపల్లి మధ్య బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఇల్లెందు మండలం చల్లసముద్రం పరిధి వేములవాడకు చెందిన కల్తి విజయ్(30) ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి పేరుపల్లి వైపు వస్తుండగా మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొట్టాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ రాజారాం తెలిపారు.

మందు కలిపిన బియ్యం తినడంతో నాటుకోళ్లు...

తల్లాడ: మండలంలోని రంగంబంజరలో క్రిమిసంహారక మందు కలిసిన బియ్యం తిన్న 180 నాటుకోళ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బానోత్ మోహన్ గురువారం పొలానికి వెళ్లగా ఆయన ఇంట్లో కుమారుడు మాత్రమే ఉన్న సమయాన గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి కాపుసారా కాస్తున్నారంటూ సోదా చేశారు. ఈక్రమంలోనే ఎలుకల నివారణ కోసం క్రిమిసంహారక మందు కలిపిన ధాన్యాన్ని పారబోసి వెళ్లారు. ఈ ధాన్యాన్ని తిన్న రూ.1.50లక్షల విలువైన 180 కోళ్లు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈమేరకు మోహన్ ఫిర్యాదుతో ఎస్‌ఐ బి.కొండల్‌రావు విచారణ చేస్తున్నారు.

వందేళ్ల ఆలయంలో నేడు పునఃప్రతిష్ఠాపన

రూ.1.20 కోట్లతో శ్రీసీతారాముల ఆలయ నిర్మాణం



ముస్తాబైన సీతారామచంద్రస్వామి ఆలయం



కొలువుదీరనున్న దేవతామూర్తులు

సత్తుపల్లిటౌన్: కోటప్పకొండ రాళ్లు, మైలవరం నుంచి తెప్పించిన ధ్వజస్తంభం, తమిళనాడులోని కుంభకోణంలో రూపొందించిన ఉత్సవ విగ్రహాలు, మహాబలిపురంలో చేయించిన శ్రీ సీతారాముల విగ్రహాలతో సత్తుపల్లిలోని అయ్యగారిపేట రామాలయం కొత్తశోభ సంతరించుకోనుంది. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని ఇటీవల పునర్నిర్మించారు. ఆలయ నిర్వహణకు పూర్వీకులు ఇచ్చిన భూమిని అమ్మగా వచ్చిన నగదుతో పాటు స్థానికుల విరాళాలు కలిపి మొత్తంగా రూ.1.20కోట్లు వెచ్చించారు. ఈ ఆలయంలో శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ బాధ్యులు చల్లగుండ్ల కృష్ణయ్య, నాగళ్ల ప్రసాద్, బొంతు చంద్రశేఖర్ తెలిపారు.

బీసీలకు రిజర్వేషన్ల ప్రకటన శుభపరిణామం



మాట్లాడుతున్న శ్రీనివాస్, పక్కన నాయకులు

సత్తుపల్లి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని సీఎం ప్రకటించడం హర్షణీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ తెలిపారు. సత్తుపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో బీసీలకు ఎలాంటి మేలు చేయలేదని ఆరోపించారు. ఇప్పుడు రిజర్వేషన్లు అమలుచేస్తుంటే బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు అడ్డుకునేందుకు ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావుతో పాటు తోట సుజలరాణి, దూదిపాల రాంబాబు, కంటే నాగలక్ష్మి, చల్లగుళ్ల నర్సింహారావు, వినుకొండ కృష్ణ, సుబ్బారావు, నాగభూషణం, సందీప్, గణేష్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, పాపారావు పాల్గొన్నారు.

సుబాబుల్ వాహనాలతో సమస్యలు



ఫిర్యాదు అందజేస్తున్న వినియోగదారులు

ఏన్కూరు: ఆయిల్‌పామ్, సుబాబుల్ లోడ్లతో వెళ్తున్న వాహనాలతో విద్యుత్ తీగలు తెగి తరచూ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని పలువురు ఫిర్యాదు చేశారు. ఏన్కూరులోని సబ్‌స్టేషన్‌లో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఎన్.వీ.వేణుగోపాలచారి పాల్గొనగా ఏన్కూరు, తల్లాడ మండల వాసులు పలువురు వినతిపత్రాలు, ఫిర్యాదులు అందజేశారు. ఇళ్ల పైనుండి వెళ్తున్న తీగలతో సమస్యలు, లో ఓల్టేజీ కారణంగా ఇబ్బందులపై ఫిర్యాదు చేయగా పరిష్కారంపై ఉద్యోగులకు చైర్‌పర్సన్ సూచనలు చేశారు. ఈ సదస్సులో ఫోరం సభ్యులు కె.రమేష్, ఆర్.చరణ్‌దాస్, ఎస్‌ఏఓ శ్రీధర్, ఏడీఈ సతీష్, ఏఏఓలు సీతారాంగోపాల్, ఏఈలు ఉమాకాంత్, ప్రసాద్, కృష్ణకాంత్ పాల్గొన్నారు.

కన్నీరుమున్నీరైన మల్లుపల్లి

- హైదరాబాద్ మృతులకు అంత్యక్రియలు

కొణిజర్ల: హైదరాబాద్ ఎల్‌బీ.నగర్‌లో సెల్లార్ తవ్వకం పనిచేస్తుండగా మట్టి పెళ్లలు కూలగా కొణిజర్ల మండలం మల్లుపల్లికి చెందిన కూలీలు ఆలకుంట వీరయ్య, ఆయన కుమారుడు ఆలకుంట రాముతో పాటు మేనల్లుడు ముద్దంగుల శ్రీనివాస్ బుధవారం మృతి చెందిన విషయం విదితమే. వీరి మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం గురువారం స్వగ్రామానికి తీసుకురాగా బంధువులు, గ్రామస్తుల అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహాలతో వచ్చిన వాహనాన్ని కొణిజర్ల నుంచి మల్లుపల్లి వరకు ర్యాలీగా తీసుకెళ్లారు. కాగా, భర్త, కొడుకు ఒకే ఘటనలో మృతి చెందడంతో వీరయ్య భార్య రాధమ్మ చేసిన రోదనలు స్థానికులను కంట తడి పెట్టించాయి. అలాగే, చేతికి అందొచ్చిన శ్రీనివాస్ మృతితో ఆయన తండ్రి కృష్ణ, సోదరుడు శ్రీమంత్ రోదిస్తుండగా ఆపడం ఎవరివల్లా కాలేదు. గ్రామానికి చెందిన ముగ్గురు ఒకేరోజు మృతి చెందడంతో స్థానికంగా విషాదం నెలకొంది.